విశాలాంధ్ర
శ్రీకాకుళం
బుధవారం 30, అక్టోబర్, 2024
పేజి నెం. 9

పద్మావతి డైరెక్టర్ 'దుర్గాప్రసాద్'కు అభినందన

విశాలాంధ్ర – నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ సిహెచ్.దుర్గా ప్రసాద్‌కు మంగళవారం తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ అభినం దనలు తెలియజేసింది. ఈ సంద ర్భంగా టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష కుమార్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డా.అబ్దుల్ కలాం జాతీయ అవార్డ్‌కు పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఎంపిక కావటం అభినం దనీయమని, ఆయ నకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువతో సన్మానం చేశారు. దుర్గా ప్రసాద్‌ను అభినందించిన వారిలో టిఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు, రామకృష్ణ, నర్సింహులు, విజయ్, కృష్ణ, నీలం, ధర్మేంద్ర, జగదీష్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి
ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర – పోలాకి: గ్రామాల్లో సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం దీర్ఘాశి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీని మరింత బలోపేతం చేస్తూ ఎన్టీఆర్ ఆశయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తారని అన్నారు. ఏ ఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఖైరి భాస్కరరావు, సూరపు నారాయణ దాసు, మాజీ సర్పంచ్లు లుకలాపు రాంబాబు, పల్లి సూరిబాబు, ఎంపీటీసీ ప్రతినిధి గొండు మురళీకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు మండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారుల అలసత్వమా..? ఆక్రమణదారుల బరితెగింపా..?

– యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

ఆగస్టు నెలలో సర్వే నెంబర్ 97లో నిర్మిస్తున్న పెద్ద భవన నిర్మాణం పరిస్థితి

ప్రస్తుతం అదే భవన నిర్మాణ పరిస్థితి

విశాలాంధ్ర – శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో భూముల రేట్లు అధికమవడంతో ఆక్రమణదారులు చెరువులు, కాలువలను కప్పి పెద్ద ఎత్తున భవనాలు నిర్మిస్తున్నారు. ఇలాంటి వాటిపై ఎవరైనా ఫిర్యాదు చేసినా, పత్రికల్లో వార్తలు వచ్చినా తరువాత అధికారులు సంబంధిత నిర్మాణదారులకు నిర్మాణాలు ఆపాలని ఆదేశించినప్పటికీ నిర్మాణదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎచ్చెర్ల మండలం దుప్పలవలస రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 97లో చెరువుకు ఆనుకొని అక్కడ భవనాలు నిర్మిస్తున్నారని, దీని మీద విచారణ చెయ్యాలని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'పెద్దపెద్ద భవనాలు కడుతున్నా కన్నెత్తి చూడని అధికారులు' అనే శీర్షికతో విశాలాంధ్రలో ఆగస్టు నెలలో కథనం ప్రచురితమైంది. అయితే దీనిపై వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఎచ్చెర్ల మండల తహశీల్దార్ ఎ.సింహాచలంకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్మాణం ఆపమని చెప్పినట్లు కలెక్టర్‌కు సెప్టెంబర్‌లో ఇచ్చిన నివేదికలో తెలిపారు. అయితే ఇప్పుడు అదే భవనం సుమారు 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండవ అంతస్తు నిర్మాణం పూర్తి కావస్తోంది. అధికారులు ఆపమని చెబితే ఆ నిర్మాణం ఎందుకు ఆగలేదు? ఇది అధికారుల అలసత్వమా లేక ఆక్రమణదారుల బరితెగింపా అనేది అధికారులే చెప్పాలి. నివేదికలో ఒకలా... వాస్తవం మరోలా ఉండడాన్ని ఏమనాలి. తప్పుడు నివేదికలతో పై అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారా లేక అధికారుల పర్యవేక్షణ లోపమా స్థానిక అధికారులకే తెలియాలి.

పలాస ఆర్డీఓగా గ్రంధి వెంకటేష్

విశాలాంధ్ర – పలాస: పలాస డివిజన్ అధికారి (ఆర్డీఓ)గా మంగళవారం గ్రంధి వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సుదర్శనదొర అనారోగ్యానికి గురి కావడంతో టెక్కలి ఆర్డీఓ క్రిష్ణమూర్తికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అనంతపురం నుండి నూతన ఆర్డీఓగా గ్రంధి వెంకటేష్ పలాసకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి అదేశాలు జారీ కావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించగా, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది బొకేలు అందించి అభినందనలు తెలియజేశారు.

సమాజంలో పోలీసుల పాత్ర కీలకం

విశాలాంధ్ర – కొత్తూరు: ప్రస్తుత సమాజంలో పోలీసుల పాత్ర కీలకమని సీఐ ప్రసాదరావు అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా కొత్తూరు మండలంలో ఉన్న స్కూల్ పిల్లలకు పోలీసుల పాత్రపై వివరించారు. చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థుల సందేహాలను సీఐ ప్రసాదరావు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

విశాలాంధ్ర – జలుమూరు: మండలం లింగాన్నా యుదుపేట గ్రామానికి చెందిన ధర్మాన భాను ప్రసాద్‌కి సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని సంక్షేమం తోపాటు ప్రజలు వ్యక్తిగత బాధల్లో కూడా ముఖ్యమంత్రి సహాయం అందించడం ఆనందాయకమని అన్నారు.

బావనపాడు తీరాన్ని పరిశీలించిన సీఐసీఈఎఫ్ డీడీ బెలియప్ప

విశాలాంధ్ర – సంతబొమ్మాళి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు తీర ప్రాంతాన్ని బెంగళూరుకు చెందిన కేంద్ర ప్రభుత్వ తీర ప్రాంత ఇంజనీర్ సంస్థ (సిఐసిఈఎఫ్) డిప్యూటీ డైరెక్టర్ ఎం.బి.బెలియప్ప మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్రానికి లేఖ రాయడంతో ఈ పరిశీలన జరిగింది. మత్స్య కారుల బోటులో సముద్రం తీరంలో ప్రయాణించి, ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదిత స్థలాన్ని, సముద్ర ముఖద్వారం వద్ద మేటలు వేసిన ఇసుక దిబ్బలను, ముఖ ద్వారానికి ఇరువైపులా ఉన్న క్రిక్ వాల్‌ను పరిశీలించారు. ఇసుక మేటలను శాస్త్రీయంగా పరిష్కరించే నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని అన్నారు. త్వరలోనే భావనపాడు జెట్టికి పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. మత్స్య శాఖ జేడీ పివి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవ సాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై పరిశీలనకు బెంగళూరు నుంచి సిఐసిఈఎఫ్ సంస్థ వచ్చిందని అన్నారు. అంతకుముందు మత్స్యకార నాయకులు మాట్లాడుతూ సముద్ర ముఖ ద్వారం వద్ద ఇసుక మేటలు వేయడం వల్ల వేట నిషేధిత కాలం నుండి ఇప్పటివరకు వేటసాగక ఇబ్బంది పడుతున్నామని అన్నారు. వేట సాగక పోవడంతో వలస బాట పట్టారని, వెంటనే ఇసుక మేటలు తొలగించి సమస్య పరిష్కరించాలని, మత్స్యకా రులకు శాశ్వతంగా జీవనోపాధి దొరికే ఫిషింగ్ హార్బర్ నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడీ సత్యనారాయణ, టెక్కలి ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో, స్థానిక సర్పంచ్ బుడ్డ మోహన్ రెడ్డి, మత్స్యకార సొసైటీ సంఘ అధ్యక్షుడు గొరకల ఆదినారాయణ, మత్స్యకార నాయకులు సైన గురువులు, కారాడ పోతయ్య, కారాడ చిన్నబాబు, కారాడ మురళి, తులసీదాస్, అడ్ల రాజేష్, మేఘవరం ఎంపీటీసీ సురాడ రాజారావు, అప్పాజీ, తదితరులు ఉన్నారు.

ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రిమ్స్ ఆసుపత్రి

– రిమ్స్‌ని అభివృద్ధి చేసి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం
– ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర – శ్రీకాకుళం టౌన్: నిత్యం వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందజేసే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అధికంగా సమస్యలు నెలకొన్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎమ్మెల్యే శంకర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వసతుల కొరత వేధిస్తోందని చెప్పారు. ఆసుపత్రిలో ఇన్ఫ్రాస్ట్రక్చర్, సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేకపోయిందని చెప్పారు. ఆసుపత్రిలో సమస్యలతో పాటు సిబ్బంది కొరత కూడా అధికంగా ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బెడ్లు కూడా తగినంత లేకపోవడంతో కొన్నిసార్లు రోగులకు ఒకే బెడ్‌పై ఇద్దరికీ వైద్యం చేయాల్సిన అవసరం కూడా వస్తుందన్నారు. ఆసుపత్రి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు వైద్యం అందించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిమ్స్ ఆసుపత్రికి ఎమ్మెల్యే గొండు శంకర్ 20 సీలింగ్ ఫ్యాన్లు, స్టేడియం కోఆర్డినేటర్ లక్ష్మణరావు 25 సీలింగ్ ఫ్యాన్లు, అందవరపు సంతోష్ వంద ట్యూబ్ లైట్లు, ఆర్కే ఫ్రూట్స్ కృష్ణ, గాంధీ 50 ట్యూబ్ లైట్లు, కే శ్రీనివాసరావు పిఎన్ కాలనీ (కేబుల్ శ్రీను) 10 వాల్ ఫ్యాన్లు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి ఆర్ఎంవో, ఇతర అధికారులు, సిబ్బంది కూటమి ప్రభుత్వ నేతలు, కార్యకర్తలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి: పార్టీ సభ్యత్వంతో టీడీపీ పార్టీని బలోపేతం చేయాలని మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలో బుర‌గాం పంచాయతీలో శేషగిరి చేతుల మీదుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-2026కు సంబంధించి టీడీపీ సభ్యత్వం నమోదు చేస్తున్నట్లు ఉన్నారు. ఈ సభ్యత్వం పొందిన వారికి 5 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గేదిల సంజీవరెడ్డి, జనపాన రూపవతి, తేజ, రమణయ్య, కోదండరావు, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హస్త కళాకారులను ప్రోత్సహించాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర – శ్రీకాకుళం టౌన్: భారతీయ సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపమైన ప్రాచీన హస్తకళలను ఆదరించి హస్త కళా కారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఫారెస్ట్ ఆఫీసు ఎదురుగా హ్యాండ్లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కళా నైపుణ్యంతో రూపొందించిన ఉత్ప త్తులను ఒకే వేదికపై ప్రదర్శించి అమ్మకాలు నిర్వ హించడం అభినందనీయమని అన్నారు. ప్రాచీన హస్తకళలు భారతీయ సాంస్కృతి, సంప్రదా యాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. హస్త కళాకారులు అత్యంత కళా నైపుణ్యంతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించడం అభినంద నీయమన్నారు. బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, కళంకారి, ఖాదీ వస్త్రాలు, మంగళగిరి చీరెలు, బ్లౌజ్ మెటీరియల్స్, వరంగల్ టవల్స్, లుంగీలు, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ చీరెలు, చిన్నారుల ఫ్రాక్స్, సూట్స్, కొండపల్లి బొమ్మలు, లెదర్ బ్యాగ్‌లు, ఇమిటేషన్ జ్యూయెలరీ, కళాత్మక ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనే లక్ష్యం

– పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు భవిత
– ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర – ఆమదాలవలస: గ్రామస్థాయిలో మౌలిక సదుపాయల కల్పనకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలో శ్రీనివా సాచార్యులపేట, అక్కులపేట గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా 60.20 లక్షల రూపాయలతో నిర్మించనున్న పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాల వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు అందలేదని పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు భవితవ్యం అందుతుందన్నారు. ఈసర్లపేట గ్రామంలో ప్రభుత్వ భూమిలో 60 ఎకరాల విస్తీర్ణంలో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మా ణానికి గతంలో ప్రతిపాదనలు చేస్తే వాటిని గడిచిన ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. నదుల అనుసంధానం పనులు పూర్తి చేసి, తాగు, సాగునీటిని ప్రతీ గ్రామానికి అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని చంద్రశేఖర్, సర్పంచులు బొకేవల్లి వసుమతి, బొడ్డేపల్లి గౌరీపతి, నాయకులు సనపల డిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, పేడాడ ప్రకాష్ రావు, తమ్మినేని అమర్నాథ్, జ్యోతి రావు, కోరుకొండ వెంకటరమణ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెరపురుగు పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర – రణస్థలం: మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో బండిపాలెం గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు, 500 మిల్లీ వేప నూనె పిచికారి చేయాలని అన్నారు. పతర్లపల్లి, కొవ్వాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో విజయ భాస్కర్, రైతులు ఉన్నారు.

బెజ్జపల్లిలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర – నందిగాం: రబీ పంటలకు కావాల్సిన విత్తనాలను గుర్చి రైతు సేవా కేంద్రాలలో తెలియజేయాలని వ్యవసాయ అధికారి పెయ్యల శ్రీకాంత్ వర్మ అన్నారు. మండలం బెజ్జిపల్లి హర్షబాద ఆయా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు రైతులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం పాట్లు

విశాలాంధ్ర – జలుమూరు: జలుమూరు, సారవకోట మండలాల పరిధిలో అనేక గ్రామాల్లో పంట చివరి దశలో సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సారవకోట మండలం కిడిమి భద్రాచలం, మధనాపురం అనేక సాగునీరు కోసం రైతులు పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. ఇంతవరకు వరుణ దేవుడు కోసం ఎదురుచూసిన రైతులు చివర దశలో సకాలంలో వర్షాలు లేక ప్రతి రైతు ఇంజిన్లపై ఆధారపడుతున్నారు. పొలానికి దూరంలో ఉన్న చెరువుల్లో ఇంజన్ ఏర్పాటు చేసి నీటి కోసం కష్టాలు పడుతున్నారు. సాగునీరు కోసం రైతులు, రహదారులు పాడవడంతో ప్రయాణికులు బాధపడుతున్నారు. రెండు మూడు రోజుల్లో కాస్త వర్షాలు కురవకపోతే పంటకు నష్టం తప్పదని పలు ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాడతెగులుపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర – కవిటి: వరికి ప్రస్తుతం ఆశిస్తున్న పొడ తెగులు, దోమపోటుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి బి.దుర్గాప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జగతి పంచాయతీలో గల బట్టివానిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరికి పొడతెగులు ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు హెక్సకోనజోల్ 400 మిల్లి లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, దోమ తీవ్రతకు పైమిత్రోజెన్ డైనక్ష 130 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బి.కళ్యాణ్, వెటర్నరీ అసిస్టెంటు నీలవేణి, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర – కంచిలి: మండలం పెద్ద శ్రీరాంపురంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. పార్టీ సీనియర్ నేత మాదిన రామారావు ఇంటి వద్ద ఈ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు, మహిళలు హాజరై సభ్యత్వాలను పొందారు. వంద రూపాయల సభ్యత్వంతో పార్టీ తరపున జీవిత బీమా సౌకర్యం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత మాదిన మార్కండేయులు, యువనేత మాదిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర – ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్లో పీయూసీ చదువుతున్న వినూత్న ఇటీవల నిర్వహించిన 9వ రాష్ట్ర జూనియర్ అంతర జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విద్యార్థినిని క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కార్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

విశాలాంధ్ర – సోంపేట: పలాస ఆర్టీసీ డిపో నుంచి కార్తీకమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామ క్షేత్రాలైన అమరావతిలో అమరేశ్వరస్వామి, భీమవరంలో సోమేశ్వ రస్వామి, పాలసకొల్లులో క్షీర రామలింగేశ్వర స్వామి, ద్రాక్షారాంలో భీమేశ్వరస్వామి, సామర్లకోటలో కుమార రామ భీమేశ్వరస్వామి శైవ క్షేత్రాలు సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం పలాసలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి తిరిగి మంగళవారం ఉదయం 8 గంటలకు పలాస కాంప్లెక్స్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో బస్సులు నడవనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క మనిషికి సూపర్ లగ్జరీ 2700 రూపాయలు, అల్ట్రా డీలక్స్ 2650 రూపాయలు, ఎక్స్‌ప్రెస్ 2250 రూపాయలు టిక్కెట్‌గా చెల్లించాలని కోరారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్ మొబైల్ నెంబర్ 99 59225610 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

మహిళల్లో అక్షరాస్యత పెంచేందుకే ఉల్లాస్

– జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా

విశాలాంధ్ర – శ్రీకాకుళం: మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా తెలిపారు. జిల్లా స్థాయి ఉల్లాస్ ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభి ంచారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డీఆర్డీఏ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోజన విద్యపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ముద్దాడ వెంకట రమణ మాట్లాడుతూ అక్షరాస్యతలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు 'ఉల్లాస్' దోహదం చేయనుందని, ఈ శిక్షణకు పొదుపు సంఘాల్లో మహిళలు, పాఠశాలల్లో పనిచేసే సహాయకులు, వంట పనివారు, ఆయాలు, అంగన్వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. వీరికి నిర్దిష్ట షెడ్యూలు ప్రకారం.. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారనీ ప్రతి 10 మందికి ఓ సహాయకులను నియమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, ఏపీఓ బాలచందర్ పాల్గొన్నారు.

బీఆర్ఏయూలో యునిక్స్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూని వర్సిటీలో వినూత్న సాంకేతిక ఆలోచనలు, ప్రయోగాలను ప్రోత్సహించేందుకు సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అడకమిక్ రీసెర్చి క్యూబ్ (స్పార్క్)తో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, స్టూడెంట్ ఎక్సలెన్స్ క్లబ్‌ను ఏర్పాటుచేసింది. యునిక్స్ పేరుతో రూపొందించిన ఈ ఇన్నోవేషన్స్ క్లబ్ పోర్టల్‌ను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మంగళవారం ఆవిష్కరించారు. ఎయిర్ స్పేస్, రొబోటిక్ తదితర రంగాల్లో నిపుణులుగా యూనివర్సిటీలో విద్యార్థులను తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యంగా ఈ క్లబ్ పనిచేయనుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఓఎస్డ్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, ప్లేస్మెంటు ఆఫీసర్ కె.విద్యాసాగర్, డాక్టర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

పూర్తిగా అధ్వానంగా పాడైన కిడిమి రహదారి

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండలం సారవకోట నుండి సోద సముద్రం మీదుగా కిడిమి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా ప్రయాణానికి ఇబ్బందికరంగా తయారయింది. గత ఐదేళ్లుగా ఈ రహదారి ని అధికారులు, నేతలు పట్టించుకోకపోవడం మరింత దారుణంగా తయారయిందని ప్రజలు వాపోయారు. ఈ రహదారి వెంబడి ద్విచక్ర వాహనాలతో వెళ్లాలంటే ఎంతో ఇబ్బందికరంగా ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. స్థానిక నేతలు నరసన్నపేట శాసనసభ్యులు రమణమూర్తి ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అనధికార భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అనధికారకంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కో ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడపడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం జరుగుతున్నాయని, దీని వలన మున్సిపాలిటీకి ఆదాయం కొల్పోవడంతో పాటు మౌళిక సదుపాయాలు కల్పించడంలో ఇబ్బందులకు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. మున్సిపాలిటీలో జి ప్లస్ టూ అనుమతులు పొంది అనంతరం సుడా అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నారని దీనితో టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందన్నారు. దీనిపై కమీషనర్ ఎన్.రామారావు స్పందిస్తూ టౌన్ ప్లానింగ్ విదానం పూర్తిగా నిర్వీర్యమయిందని అంగీకరిస్తున్నామన్నారు. తమకు ఎక్కడ ఫిర్యాదు అందిన తాము గుర్తించిన వాటిపై యాజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. 90శాతం అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని, అంతే కాకుండా నేరుగా సుడా నుండి అనుమతులు తెచ్చుకోవడంతో మున్సిపాలిటీపై వారి పెత్తనం ఏమిటనే విషయంపై సుడా శాఖకు లేఖ కూడా రాశామని వారి జవాబు కోసం ఎదురుచూస్తున్నామన్నారు. దీనిపై చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ అక్రమ భవన నిర్మాణాలపై ఇప్పటికే 50 కేసులు నమోదు చేసి కోర్టు ద్వారా మున్సిపాలిటీకి 50 లక్షల వరకు ఆదాయం తెచ్చుకోవడం జరిగిందని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే తక్షణమే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఆన్ లైన్ అనుమతులపై కూడా సుడాకు వివరణ కోరుతున్నామన్నారు. కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న చెరువులను శుభ్రం చేయాలని కోరారు. కార్తీక మాసంలో మహిళలు చెరువులు వద్ద పూజలు చేస్తుంటారని, ఈ సందర్భంగా భద్రం కొనేరు. ముత్యాలమ్మ కొనేరు. రాధాకాంత చెరువులలో పూడికతీతలు చేపట్టి, కొనేరులను శుభ్రపరచి భక్తులకు అందుబాటులోనికి తీసుకురావాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో మహిళలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, సనపల సింహాచలం మాట్లాడుతూ కెటి రోడ్ వెడల్పు చేసినప్పటికీ ఆ ప్రాంతంలో ప్రతీ దుఖాణం ఎదుట దుఖాణదారులకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు దుఖాణాలు పెట్టడం వల్ల వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులకు గురి అవుతున్నారని, అదే విదంగా వ్యాపారులు మైక్ పై ప్రచారం చేయడంతో ప్రజలకు మరింత ఇబ్బందిగా ఉందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, డిఇ కనకరాజు, టిపిఓ ఎన్.వరప్రసాద్, ఎఇ కిరణ్, కౌన్సిలర్లు డిక్కల ఆనంద్, గుజ్జు జోగారావు, శర్వాణ గీత, జోగ త్రివేణి, బెల్లాల శ్రీను లతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిబంధనలు సవరించాలి

ప్రధానమంత్రికి లేఖరాసిన సామాజిక కార్యకర్త అప్పన్న

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం (పీఎం కిసాన్) ప్రారంభించినప్పటి పాత మార్గదర్శకాలనే ఇప్పటికీ కొనసాగించటం కారణంగా, లక్షలాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వ సాయం అందడం లేదని బోరుభద్ర గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గొణపు అప్పన్న అన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కి లేఖ రాసినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఐదెకరాలలోపు సాగుభూమి ఉన్న రైతులకు కేంద్రం పీఎం కిసాన్ స్కీం ప్రవేశపెట్టిందని, ఈ పథకం కింద ఏటా రూ.6 వేల నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు. 2018 డిసెంబరు నుంచి 2019 ఫిబ్రవరి 1 మధ్య భూమి ఎవరి పేరుతో ఉంటే వారే పీఎంకిసాన్ పథకానికి అర్హులని కేంద్రం మార్గదర్శకాల్లో పేర్కొందని భూయజమాని మరణిస్తే వారసులకు భూమి సంక్రమించడం అలాగే ఇతర రైతులు భూమి కొనుగోలు చేయడం చాలావరకు భూ బదలాయింపులు జరుగుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. అర్హతను బట్టి యాజమాన్య బదిలీతో భూమి ఉన్న రైతులకు ఈ పథకం వర్తింపజేయాల్సి ఉందని. కానీ 1.2.2019 తర్వాత సేల్ డీడ్, పార్టీషియన్ డీడ్, గిఫ్ట్ డీడ్ ద్వారా భూమి సంక్ర మించిన రైతులు అర్హులు కాదంటూ 2020 మార్చి 29న కేంద్రం సవరణ మార్గదర్శకాలు జారీ చేసిందని, ఈ ఉత్తర్వులు 2019 నుంచి ఐదేళ్లపాటు కొనసాగుతాయని తెలిపిందని ఈ సవరణల ద్వారా 2019 ఫిబ్రవరి 1 తర్వాత భూమి బదిలీ కాబడిన రైతులు పీఎం కిసాను అనర్హులవు తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. కటాఫ్ తేదీ ముగిసిన తర్వాత కేంద్రం పీఎంకిసాన్ పథ కాన్ని అందరికీ వర్తించే విధంగా నిబంధనలు సవరించాల్సి ఉన్నా, ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదని. దీంతో పీఎంకిసాన్ పథకానికి అర్హులైన సన్న, చిన్నకారు రైతు లకు నిధులు అందకుండా పోతున్నాయని అన్నారు. కేంద్రం లో మూడవసారి అధికార పీఠం పై కొలువుదీరిన మోడీ సర్కారు దేశం లోని పేద , దిగువ మధ్యతరగతి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పీఎంకిసాన్ పథకంలో ప్రస్తుతం అమలుచేస్తున్న నిబంధనలను సవరిస్తూ అర్హతకలిగిన ప్రతి రైతుకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విభిన్న జాతుల చేపల పెంపకంతో రైతులకు ఆదాయం

- కె వి కె కొఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-ఆమదాలవలస: వ్యవసాయ అనుబంధ రంగాలలో నూతన పద్ధతులను అవలంబించడం ద్వారా ఆదా య మార్గాల పెంపొందించుకోవచ్చు అని కె వి కె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండ లి హైదరాబాద్, కృషి విజ్ఞాన కేంద్రం ఆమదా లవలస సంయుక్తంగా నిర్వహించిన వృత్తి విద్య శిక్షణ ముగింపు కార్యక్రమం లో మంగ ళవారం రైతులకు శిక్షణ పత్రాలు అందించి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాలను ఉపయో గించుకోవడం ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలని తెలిపారు. శిక్షణలో భాగంగా విభిన్న జాతుల చేపల పెంపకం ద్వారా ఆదా యం పెరుగుతుందన్నారు. అలాగే తరచూ వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండా లని ప్రస్తుతం వస్తున్న నూతన విధానాలను అవలంబించడం ద్వారా సాగు ఖర్చు తగ్గిం చుకోవడం, దిగుబడులను పెంచుకోవచ్చని మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎం పేడ (ఎం పి ఈ డి ఏ) విశా ఖపట్నం డైరెక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడు తూ చెరువులలో విభిన్న జాతుల పెంపకంపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగం చేసుకోవాలని తిలాపియా, పండుగప్ప, నీలకంఠ రొయ్య వంటి విభిన్న జాతుల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. శిక్షణలో భాగంగా చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అనే శిక్షణ కరదీపికను విడుదల చేసి రైతులకు అందించారు. ఈ కార్యక్రమం లో నాక్సా కోఆర్డినేటర్ బాలాజీ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సంతోష్, అధి కారులు రైతులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభంలో గుర్తిస్తే చికిత్స సులభం

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ దుంగ హర్షవల్లి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రారంభ దశలో రొమ్ము క్యాన్సర్ గుర్తిస్తే చికిత్స చేయటం ఎంతో సులభతరం అవుతుంది అని ప్రముఖ వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం శ్రీకాకుళం అధ్యక్షురాలు డాక్టర్ దుంగ హర్షవల్లి అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం సయ్యుక్త నిర్వహణలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో క్యాన్సర్ ను గుర్తిస్తే చికిత్స చేయటం ఎంతో సులభతరం అవుతుంది అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్యాన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం లో కూడా క్యాన్సర్ ను చేర్చి ఉచితంగా చికిత్స అందిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. శరీరంలో ఎక్కడైనా వాపు లేదా గెడ్డలు వస్తె సత్వరమే చికిత్స చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో బెస్ట్ క్యాన్సర్ పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్ణయం మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సకిలా సారథ్యంలో సదస్సు ర్యాలీ చేపట్టామన్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.. మహిళలు క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వక్తలు వివరించారు.. ఈ కార్యక్రమంలో రిమ్స్ ఆస్పత్రి వైద్యులు,నర్సింగ్ విద్యార్థులు, శ్రీకాకుళం నగరంలో ఉన్న మహిళా డాక్టర్స్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్ జరగాలి : కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నవంబర్ 14న మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ ప్రగతిపై మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే నెల 14న ప్రతీ పాఠశాలలో టీచర్స్ పేరెంట్స్ సమావేశం జరగాలని, ఈ సమావేశాలు ఒక పండుగ వాతావరణాన్ని తలపించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లి తండ్రులు, విద్యార్థుల ప్రవేశం నుంచి కార్యక్రమం ముగిసే వరకు సందడిగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లితండ్రులు, విద్యార్థులతో పాటు ప్రజాప్రతినిధులు అందరినీ ఆహ్వానించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తూ.చ తప్పక పాటించాలని సూచించారు. పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో స్థలాభావాన్ని బట్టి అవసరమైతే టెంట్ వేసి, కుర్చీలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యా నాణ్యత ప్రమాణాలు, పోషకాహారం తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, విద్యార్థుల ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు సమస్యలు తెలియజేస్తే, వాటిని స్వీకరించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతీ పాఠశాల ముఖద్వారం వద్ద అరటిచెట్లతో అలంకరించాలని, మామిడి తోరణాలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో తల్లులతో రంగవల్లికలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి, తల్లితండ్రులతో ఆవరణలోకి వచ్చిన క్షణం నుంచి ఆ పాఠశాలలో ఆవరణలోని రంగవల్లికలు, పాఠశాల పరిశుభ్రత, పిల్లల పెయింటింగ్స్, పాఠశాలలోని వసతి సౌకర్యాలు, విద్యా నాణ్యత ప్రమాణాలు, మన బడి - మన తోట, మై స్కూల్ - మై ప్రైడ్ వంటి అంశాలపై - అవగాహన కల్పిస్తూ సమావేశానికి తీసుకువెళ్లాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలలో జరిగిన కార్యక్రమాలపై ఫోటోలను, వీడియోను తీసి తమకు పంపాలని, అందులో ఉత్తమ పాఠశాలకు అవార్డును ప్రకటిస్తామని కలెక్టర్ చెప్పారు.జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉందని, అందు వలన గిరిజన ప్రాంతంలోని పాఠశాలలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గిరిజన ప్రాంతంలోని ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధులకు హాజరయ్యేలా అటెండన్స్ ఉండాలని, అత్యవసర పరిస్థితిల్లో సెలవుపై వెళ్లవలసి వస్తే మండల విద్యాశాఖ అధికారి అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ తేల్చి చెప్పారు. పాఠశాలలకు విద్యార్థులు గైర్హాజరు కారాదని, అలా కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. అనారోగ్యం కారణంగా పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇంటికి వెళ్లి, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచి తిరిగి పాఠశాలకు వచ్చేలా చేయాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయులదేనని కలెక్టర్ వివరించారు. ప్రతి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు మారుపేరుగా నిలిచిన పాఠశాలకు స్వచ్ఛ సంకల్ప్ అవార్డును ప్రతి నెలా ప్రకటిస్తామని ఇదివరకే తెలియ జేయడం జరిగిందని, అటువంటి పాఠశాలల వీడియోలు, ఫొటోలు తమకు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి గత రెండేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా 10వ తరగతి ఫలితాల్లో జిల్లా తొలిస్థానంలో నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మై స్కూల్-మై ప్రైడ్‌లో భాగంగా విద్యార్థులు మంచి ఫలితాలు సాదించడం, ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల మార్గాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని, ఇందుకు ప్రతిరోజు వారు అభ్యసించిన పాఠ్యాంశా లపై ప్రశ్నాపత్రం తయారుచేసి పరీక్షలు నిర్వహించాలన్నారు. తద్వారా విద్యార్థులు నేర్చుకున్నది తెలుస్తుందని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి తగిన తర్ఫీదును ఇచ్చేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. పీఎం శ్రీ పథకం కింద ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని, ఇందులో కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను తూ.చ పాటించా లన్నారు. పిఎం శ్రీ పథకం, బడి బయట పిల్లలను బడిలో చేర్పించుటకు ఒక్కో అధికారిని నియమించాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరచిన పాఠశాలకు పిఎం శ్రీ అవార్డు కూడా లభిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈపథకానికి ఇచ్చే నిధులను దుర్వినియోగం చేస్తే, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతినాయుడు, విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎంఈ రమాజ్యోతి, మండల విద్యాశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులను పాటిస్తే ప్రయోజనం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, బుడగట్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వై.సురేష్ మాట్లాడుతూ వరిలో సుడిదోమ సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. మత్స్యశాఖ అధికారి ఎస్. ముసలినాయుడు పీఎంఎంఎస్వై పథకంపై సబ్సిడీపై ఇచ్చే వలలు, ఇంజన్లు తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో బుడగట్లపాలెం సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, మాజీ సర్పంచ్ అలుపన నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో క్యూ లైన్ ఏర్పాట్లు

విశాలాంధ్ర-జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగం లో కొలువై ఉన్న శ్రీమధుకేశ్వర స్వామి కార్తీక మాస ఉత్సవాలు నేపథ్యంలో అనేక జిల్లాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో భారీ క్యూ లైన్ ఏర్పాటు చేశారు. క్యూలైన్లతోపాటు నేడు, రేపు భక్తులకు నీడనిచ్చే టెంట్లు, షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి పి ప్రభాకర్ రావు తెలిపారు. గర్భగుడిలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ వెలుగులతో అందరికీ పూజలు జరిగే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ప్రభాకర్ రావు తెలిపారు.

బాధితులకు బాసటగా నిలుస్తున్న మామిడిపల్లి యువత

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన యువకులు బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. ఈ యువకులు మామిడిపల్లి టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌గా ఏర్పడి ఇటీవల ప్రమాదానికి గురైన తెలుకల ప్రశాంత్‌కు వైద్య సేవల నిమిత్తం 1లక్ష 36వేల 500 రూపాయలు అందజేశారు. అలాగే గ్రామ రైతు సంఘానికి 70వేల రూపాయలు విలువ చేసే డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. లక్షా 20వేల రూపాయల వ్యయంతో మామిడిపల్లి మెయిన్‌రోడ్డు జంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లే సుమారు కిలోమీటరు పొడవైన రోడ్డు మార్గానికి ఇరువైపులా మొక్కలను నాటారు.

సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆగదు

విశాలాంధ్ర-కవిటి: బెంతొరియాల కుల ధ్రువీకరణ పత్రాల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తామని బెంతొరియా సంఘ నాయకులు అన్నారు. కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంకు 308వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో తిప్పినపుట్టుగ గ్రామానికి చెందిన మోహన్ సాహు, ఖగపతి, దుదిష్టి,కుమార్, లలిత్, ధర్మ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. కుల ధ్రువపత్రాలు లేక తమ బతుకులు అంధకారంగా మారాయని వాపోతున్నారు.

ఒకరిపై హత్య కేసు నమోదు

విశాలాంధ్ర-నందిగాం: మండలం మర్లపాడు గ్రామానికి చెందిన తర్ని జానకి రామయ్య పై హత్య కేసు నమోదు చేసినట్లు టెక్కలి రూరల్ సీఐ కే.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాలిలా ఉన్నాయి. తర్ని వరలక్ష్మి భర్త గతంలో మృతి చెంది ఉన్నారు. వరలక్ష్మి ఒంటరిగానే ఇంట్లో ఉంటున్నారు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు, వారందరికీ వివాహాలు జరిగాయి. వారందరూ విశాఖపట్నంలో ఉన్నారు. ఈ నెల 22న వరలక్ష్మి మరిది జానకిరామయ్య వరలక్ష్మితో గొడవపడి కర్రతో బలంగా తలపై దాడి చేయడంతో వరలక్ష్మిని ఆమె కుమార్తెల వద్దకు గ్రామస్తులు తరలించారు. వరలక్ష్మి కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వరలక్ష్మి చిన్న కుమార్తె రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలల హెచ్.ఎంలతో డిప్యూటీ ఈవో సమావేశం

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో డిప్యూటీ ఈవో, విజయకుమారి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన విద్యాశాఖాధికారులు ప్రైవేట్ పాఠశాలల డేటా తీసుకొని, ఏపిఏఏఆర్ ఐడి పూర్తిగా లో పెర్ఫామెన్స్ వున్న పాఠశాలలను రివ్యూ చేయాలన్నారు. అలాగే వెబ్‌సైట్‌లో జీపి, ఈపి, ఎఫ్‌పి డేటా పూర్తిచేయాలని, ప్రతీ విద్యార్థికి ధరఖాస్తులు అందించి, వారి తల్లితండ్రుల సంతకాలు ధరఖాస్తులపై చేయించాలన్నారు. అంతేకాక సిసిఈ మార్కులు, వీరగాధ-4.0 ఎలా నమోదు చేయాలో వివరించారు. ప్రతీ ఒక్కరూ ఈ నెల 30వ తేదీ నాటికి విద్యార్థుల అటెండెన్స్ యాప్ ఆబ్సెంట్ తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఎన్‌టిసి లాప్స్ అయినవి రెన్యూవల్స్ చేయాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వాహనాల ఫిట్‌నెస్ ధృవపత్రాలు డి.ఈ.వో కార్యాలయానికి అందచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు, యు.శాంతారావు, పి.దాలినాయుడు, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర-టెక్కలి: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో టెక్కలి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రోగులకు ఉచిత మెగా వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం సిఐ అంబటి విజయ్ కుమార్ మాట్లాడుతూ జీవితంలో రెండు దానాలు గొప్పవని, ఒకటి అన్నదానం, రెండోది రక్తదానమని తెలిపారు. రక్తదానం మహాదానమని, రక్తదానం చేయడం వల్ల ఇతరు వ్యక్తులు ఆరోగ్యాన్ని ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అత్యవసర సమయంలో ఆదుకోవడానికి దాతలు ఇచ్చిన రక్తం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పిలుపుమేరకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన 256 మంది 52యూనిట్స్ రక్తదానం చేసినట్లు తెలిపారు.రక్తదానం చేసినవారికి అభినందనలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు లేని సేవ...

ఇంజనీరింగ్ చదువు కోసం 50 వేలు ఫీజు కడుతున్న స్పందన ఫౌండేషన్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం బడే కప్పన్నపేట కార్య స్థానంగా జీవించు - జీవితాన్నివ్వు అనే నినాదంతో అలుపెరుగని హద్దులు లేని సేవలతో పనిచేస్తున్న కేపి స్పందన ఫౌండేషన్ నేడు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఇజ్జన జోషి కుమార్ ఫీజు చెల్లించారు. టెక్కలి అయితం ఇంజినీరింగ్ లో ఇంజనీరింగ్ 3 వ సంవత్సరం చదువుతున్న జోషి తన తండ్రిని కోల్పోయారు. తల్లి దర్జీ పనితో జీవనం కొనసాగిస్తున్న తనకి అవసరాలు తీర్చే బంధువులు కూడా లేరు. తను హాస్టల్ లో వుండటానికి బయట ఒక సెంటర్ లో రోజుకి 70 రూపాయలు చొప్పున ట్యూషన్ చెప్పి చదువుతున్నారు. బిల్డింగ్ ఫీజు కట్టమని స్పందన ఫౌండేషన్ ను వేడుకోగా, ఫీజు మొత్తాన్ని దాతల నుండి సేకరించి అందజేసి ఫైనల్ ఇయర్ ఫీజు కూడా కడతామని భరోసా ఇచ్చింది స్పందన. రెండవ సంవత్సర ఫీజు 13000, ఇప్పుడు 15000 ఫైనల్ ఇయర్ ఫీజు 17000 మొత్తం 50000 ఫీజు భరిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు షణ్ముఖ రావు, ఉపాధ్యక్షులు సర్పంచ్ భూషణ్ రెడ్డి తెలియజేసారు. అలాగే కోర్సు పూర్తి అయ్యేంతవరకు నెలకు సరిపడా భత్యం సమకూరుస్తున్నట్లు దుంప చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారిని కలిసిన స.హ.చట్టం నాయకులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావును సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా నాయకులు కలిశారు. మంగళవారం డీఆర్వో కార్యాలయంలో నూతనంగా విధుల్లో చేరిన సందర్భంగా రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. ఈ సందర్భంగా స.హ.చ.రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖ రావు మాట్లాడుతూ ఆర్టీఐ అమలుకు కృషి చేయాలని కోరారు. రెవెన్యూ శాఖలో పౌర సమాచార అధికారులు, మొదట అప్పిలెట్ అధికారులు కోరిన సమాచారం అందించుటలో కాలయాపన చేస్తున్నారని అన్నారు.నిర్దిష్ట కాల పరిమితి 30 రోజుల్లో అందించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పాడ సూర్యనారాయణ, చుక్క రాము, ఉప్పాడ. రాజారావు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కులు పరిరక్షించుకునేందుకే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-పోలాకి: రైతులు భూ హక్కులు పరిరక్షించుకునేందుకు కూటమి ప్రభుత్వం ధ్యేయం అని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం మండలం లో కొల్లివలస గ్రామం రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో భూమి ఎవరు పేరు మీద ఉందో తెలియని దుస్థితి నెలకొందని, వాటిని సరి చేసేందుకు కృషి చేస్తుందని,భూములు రీ-సర్వే జరిగిన గ్రామాల్లో తప్పుగా నమోదు కాబడిన వాటిని సరి చేయుటకు ప్రభుత్వం రెవిన్యూ సదస్సుల నిర్వహిస్తుందని అన్నారు, గతం లో భూములు రీ సర్వే జరిగిన సమయంలో భూములు విస్తీర్ణం పరంగా తేడాలో ఉన్నచో వాటికి సంబంధించిన వాటిని సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వాటికి కూడా పరిష్కారం అవుతాయని తెలిపారు , అలాగే రీసర్వేల తప్పుగా నమోదు కాబట్టి పేర్లను కూడా సరి చేయడం జరుగుతుందని, రీసర్వేల్ ఒకే రెవెన్యూ గ్రామ సంబంధించిన ఒకే వ్యక్తికి ఒకే ఖాతా కంటే ఎక్కువ ఖాతాలు ఇచ్చిన వాటిని ఒకే ఖాతాగా మార్పు చేయబడుతుందని అని అన్నారు. పట్టాదారుడు ఎవరైనా మరణించినచో వారి యొక్క భూమిని వారు వారసులకు సరైన ఆధారాలతో మార్పు చేయబడుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ కుమార్ మండల నాయకులు మిరియాపిల్లి వెంకటప్పలనాయుడు మాజీ ఎఎంసి చైర్మన్ బైరి భాస్కరరావు వ్యవసాయ అధికారి చిరంజీవులు లుకలాపు రాంబాబు మరియు కూటమి ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పందుల నివారణకు చిట్కాలు పాటించండి

విశాలాంధ్ర-సోంపేట : పంట పొలాల్లో అడవి పందుల నివారణకు కొన్ని రకాల చిట్కాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి రైతులకు సూచించారు. ఈ మండలం జలంత్ర సోంపేట, బారువ గ్రామాల్లో మంగళవారం పొలం పిలస్తోంది కార్యక్రమాలను నిర్వహించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పంట పొలాలపై దాడి చేసి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్న అడవి పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు పొలం గట్లపై కత్తిరించిన తలవెంట్రుకలను చల్లడం, కుల్లిన కోడిగుడ్ల ద్రావణాన్ని పిచికారి చేయడం, శబ్దం వచ్చే సీసాలను పొలం గట్లపై ఏర్పాటు చేయడం కొంత మేరకు పందులను నివారించవచ్చని సూచించారు. ఖరీఫ్ వరి పంట నమోదు వివరాలను ప్రకటించిన తుది జాబితాలో రైతులు పేర్లు సరి చూసుకోవాలని కోరారు. రబీ సాగుకు అవసరమైన అపరాలు, నూనెగింజలు విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సానా రాజేష్ ఖన్నా, దున్న సత్యన్నారాయణ, సానా కామేష్, వీఆర్వో భగీరధి, బారువ ఈఓ లక్ష్మణమూర్తి, వ్యవసాయ సహాయకులు పవిత్ర, పావని, నళిని, లోలాక్షి, పశు వైద్య సహాయకులు సాగర్, హైమావతి పాల్గొన్నారు.

అనుమతులు లేని బాణాసంచా దుకాణాలపై కేసులు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం టౌన్ సర్కిల్ పరిధిలో దీపావళి బాణసంచా విక్రయించే దుకాణాలు, తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్లకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని,నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు పాటించాలని,నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నారాయణరావు తెలిపారు. షాపులను తనిఖీలను చేస్తామన్నారు. అనుమతి లేనియెడల కేసుల నమోదు చేస్తామన్నారు. షాపుల అనుమతులు కొరకు సబ్ కలెక్టర్ కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.